సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.17,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,500 పలికాయి. 236 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.21

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.21, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/21.8°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పనితీరుకు ప్రశంసలు



ఆరోగ్య మిత్రకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఉన్నతాధికారులు

పుట్టపర్తి అర్బన్: మెరుగైన వైద్య సేవలు అందించిన పలువురు వైద్య సిబ్బందికి కలెక్టర్ అరుణ్‌బాబు సేవామిత్ర అవార్డులు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఆరోగ్యమిత్రలు నాగార్జున (ధర్మవరం), భారతి (కదిరి)కి ప్రశంసాపత్రాలు, నగదు చెక్కు అందించారు. మరింత బాగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ చేతన్, డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలను వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి సోమవారం విడుదల చేశారు. మొత్తం 7,203 మంది పరీక్షలు రాయగా, 4,739 మంది ఉత్తీర్ణులయ్యారు. బీఏలో 1,101 మందికి గాను 790 మంది, బీకాంలో 5,174 మందికి 3,259, బీబీఏలో 928 మందికి గాను 690 మంది పాసయ్యారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 12 తుది గడువుగా నిర్దేశించారు. ప్రతి పేపర్‌కూ రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, సీఈ కె.శ్రీరాములు నాయక్, అడిషనల్ కంట్రోలర్స్ డాక్టర్ వి.శైలజ, డాక్టర్ అనూరాధ, పీఆర్వో రామ్ గోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ చెండ్రాయుడు తదితరులు పాల్గొన్నారు. ఫలితాలు జ్ఞాన భూమి పోర్టల్‌లో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

కేఎంపీఎల్ సాధనలో గుత్తి డిపోకు అవార్డు



ప్రశంసాపత్రం అందుకుంటున్న మెకానికల్ చార్జ్‌మెన్ సాంబ శివప్ప

అనంతపురం సెంట్రల్: రాయలసీమ జోన్ పరిధిలో అత్యధికంగా కేఎంపీఎల్ సాధించిన గుత్తి డిపోకు అవార్డు లభించింది. 2022–23లో అత్యధికంగా 5.52 కేఎంపీఎల్ సాధించినట్లు గుత్తి డిపో అధికారి శ్రీపాద తెలిపారు. ఆర్టీసీ ఎండీ నుంచి వచ్చిన ప్రశంసాపత్రాన్ని సోమవారం గుత్తి హెచ్‌పీసీఎల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ మోహన్‌కుమార్ చేతుల మీదుగా మెకానికల్ చార్జ్‌మెన్ సాంబశివప్పకు అందజేశామన్నారు. ఈ సందర్భంగా శివప్పను ఘనంగా సన్మానించారు.

30న సివిల్ సర్వీసెస్ టోర్నీకి క్రీడాకారుల ఎంపికలు



పుట్టపర్తి టౌన్: ఆల్ ఇండియా సర్వీస్ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే ఏపీ సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 30, 31 తేదీల్లో ధర్మవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా చీఫ్ కోచ్ ఉదయ్‌భాస్కర్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొత్తం 19 రకాల క్రీడలకు సంబంధించి ఎంపికలు ఉంటాయి. ఎంపికైన వారు సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకూ గుంటూరు వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఈ నెల 29వ తేదీ సాయంత్రంలోపు జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 98494 21462లో సంప్రదించవచ్చు.

భవితకు బంగారు బాట

- 'జగనన్న విద్యాదీవెన'తో పేదింటి బిడ్డలకు సర్కారు చేయూత
- జిల్లాలో 35,044 మంది విద్యార్థులకు లబ్ధి
- కలెక్టర్ అరుణ్‌బాబు
- లబ్ధిదారులతో కలిసి మెగాచెక్కు విడుదల



లబ్ధిదారులతో కలిసి మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఆర్థిక సమస్యల కారణంగా పేదింటి బిడ్డలు చదువులో వెనుకడుగు వేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. 'జగనన్న విద్యాదీవెన' పథకం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోందని తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన కాన్ఫరెన్స్ హాలులో 'జగనన్న విద్యాదీవెన' లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ మెగా చెక్కు విడుదల చేశారు. చిత్తూరు జిల్లా నగరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమాన్ని టీవీ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని క్రమం తప్పకుండా ప్రభుత్వం చెల్లించడం గొప్ప విషయమన్నారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికీ సాయం చేస్తున్నట్లు చెప్పారు. భోజన, వసతి ఖర్చుల కోసం ఏటా రెండు వాయిదాల్లో ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. పారదర్శకంగా తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నారన్నారు. జిల్లాలో 35,044 మంది విద్యార్థులకు సంబంధించి 32,004 మంది తల్లుల ఖాతాలకు రూ.23,79,32,337 జమ చేశారన్నారు. ఇందులో 4,858 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.3,19,73,223, ఎస్టీ విద్యార్థులు 2,148 మందికి రూ.1,61,38,944, బీసీ విద్యార్థులు 18,640 మందికి రూ.12,26,08,527, ఈబీసీ విద్యార్థులు 3,355 మందికి రూ.2,87,19,932, కాపు విద్యార్థులు 2,685 మందికి రూ.1,83,76,394, మైనార్టీ విద్యార్థులు 3,331 మందికి రూ.1,99,52,344,క్రిస్టియన్ విద్యార్థులు 27 మందికి రూ.1,62,973 మేర లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, ఎస్టీ కార్పొరేషన్ అధికారి మోహన్‌రావు, బీసీ కార్పొరేషన్ అధికారి నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	విద్యార్థులు	మొత్తం
పుట్టపర్తి	5,373	3,74,97,941
పెనుకొండ	5,665	3,79,94,183
ధర్మవరం	7,406	5,40,41,317
హిందూపురం	4,479	2,83,54,223
మడకశిర	3,870	2,36,38,678
కదిరి	5,841	3,89,85,292
రాప్తాడు	2,410	1,74,20,703
మొత్తం	35,044	23,79,32,337

సంతోషంగా ఉంది



ఉన్నత విద్యకు సాయం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చుకుంటా. 'జగనన్న విద్యాదీవెన' కింద ఆర్థిక సాయం అందడం చాలా సంతోషంగా ఉంది. మాలాంటి నిరుపేద కుటుంబాల విద్యార్థులకు పథకం ఎంతో అండగా నిలుస్తోంది.

– రేష్మా, ఆత్మకూరు

పేద విద్యార్థులకు అండ



మా చదువులకు జగనన్న బాసటగా నిలుస్తున్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యార్థులకు అండగా ఉన్నారు. సంక్షేమ పథకాలతో మా కుటుంబానికి కూడా లబ్ధి చేకూర్చారు.

– ఐశ్వర్య, చిలమత్తూరు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



విద్యార్థి లోకం అంతా జపిస్తున్న ఏకైక పేరు సీఎం వైఎస్ జగన్. ఇంత వరకూ ఏ ప్రభుత్వం చేయలేని విధంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. సీఎంకు జీవితాంతం కృతజ్ఞతలు చెబుతూనే ఉంటా.

– లతశ్రీ, బుక్కపట్నం

'ఇంజినీరింగ్' ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో జూలై, ఆగస్టు నెలల్లో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. 404 మంది విద్యార్థులకు 339 మంది ఉత్తీర్ణులయ్యారు. 83.91% శాతం ఉత్తీర్ణత నమోదైందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, హెచ్‌ఓడీలు చంద్రమోహన్‌రెడ్డి, బాలనరసయ్య, కె.ఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, కళ్యాణి రాధ, అజిత, లలితకుమారి పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో నిర్వహించిన బీటెక్, బీ ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీటెక్ ఒకటో సంవత్సరం ఒకటో సెమిస్టర్, రెండో సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలు, బీ.ఫార్మసీ ఒకటో సంవత్సరం ఒకటో సెమిస్టర్, రెండో సెమిస్టర్, మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్, రెండో సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఫలితాల కోసం http://jntuaresults.ac.inను సందర్శించాలని సూచించారు.

ముళ్ల'బంధా'నికి ముకుతాడు!

☛ ఎన్‌పీ కుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం వివాహం జరిపించాలని నిశ్చయించారు. అయితే ఆ అమ్మాయికి బాగా చదువుకుని మంచి ఉద్యోగం సాధించాలనేది కోరిక. దీంతో తన ఆవేదనను 'జగనన్నకు చెబుదాం..'లో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన టోల్‌ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి తెలియజేసింది. వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి విషయం చేరవేశారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు.

- బాల్య వివాహాల కట్టడిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ పకడ్బందీ వ్యూహం
- అనర్థాలపై పెద్ద ఎత్తున ప్రచారం
- అవగాహనాలేమితో కొన్నిచోట్ల ఆగని దురాచారం



శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటయ్యాక వివరాలు	
అడ్డుకున్న బాల్య వివాహాలు	72
నమోదైన కేసులు	04
కౌన్సెలింగ్ ఇచ్చినది	164

కదిరి: బాలికలకు పుస్తెల భారం వేయకుండా పుస్తకాలు పట్టించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. బాల్య వివాహాల కట్టడికి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు, సిబ్బందితో గ్రామ స్థాయి కమిటీలను వేసింది. వారు గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే కొత్తగా శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి దాకా 72 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. నాలుగు కేసులు నమోదు చేశారు. 164 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆగని దురాచారం..

ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా జిల్లాలో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ఆడపిల్లకు పెళ్లి చేసేస్తే ఇక తమ బాధ్యత తీరిపోతుందని కొందరు.. బాగా డబ్బున్న సంబంధం కుదిరిందని ఇంకొందరు.. ఇలా రకరకాల కారణాలతో పది, పన్నెండేళ్లకే పిల్లలకు వివాహాలు జరిపించేస్తున్నారు. వారి బంగారు భవిష్యత్తును చిదిమేస్తున్నారు. చిన్న వయసులో పెళ్లి చేస్తే బిడ్డకు భవిష్యత్తులో బాధలు తప్పవని తెలిసి కూడా కష్టాల ఊబిలోకి నెట్టేస్తున్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



అమ్మాయిలకు 18 ఏళ్లు నిండకనే పెళ్లి చేయడం క్షేమకరం కాదు. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా అంతగా ఎదిగి ఉండరు. చిన్న వయసులో గర్భం దాలిస్తే బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదం. బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలున్నాయి. చిన్నారులకు పెళ్లి చేయొద్దని ఒక డాక్టర్‌గానే కాకుండా ఒక మహిళగా సలహా ఇస్తున్నా.

– డాక్టర్ ఉషారాణి, గైనకాలజిస్ట్, కదిరి

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం. బాల్య వివాహం జరుగుతున్నట్లు మా దృష్టికి రాగానే వెంటనే వెళ్లి ఆపేస్తున్నాం. అమ్మాయిలను వారి అభిరుచి మేరకు స్వధార్‌హోం, కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, సర్వీస్ హోంలకు పంపుతున్నాం. వారు మేజర్ అయ్యాక తల్లిదండ్రులకు అప్పగిస్తున్నాం.

– లక్ష్మీ కుమారి, ఐసీడీఎస్ పీడీ

రెండేళ్ల జైలు శిక్ష



బాల్య వివాహాలు చేస్తే బాధ్యులైన వారికి రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ. లక్ష జరిమానా, ప్రత్యేక సందర్భాల్లో రెండు శిక్షలు ఒకేసారి విధించే అవకాశం ఉంది. బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులతో పాటు వివాహానికి వెళ్లిన వారు, సహకరించిన వారు కూడా నేరస్తులవుతారు.18 ఏళ్లలోపు అమ్మాయితో దాంపత్య జీవితం చేసినా అది అత్యాచారం కిందికే వస్తుంది. అమ్మాయిలను బాగా చదివించి, మంచి ఉద్యోగం వచ్చాక పెళ్లి చేయాలని తల్లిదండ్రులను కోరుతున్నా.

– మాధవరెడ్డి, ఎస్పీ

సహృదయంతో స్పందించండి

- కలెక్టర్ అరుణ్‌బాబు
- 'స్పందన'కు 232 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో వచ్చే అర్జీలను సహృదయంతో పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో 'స్పందన' నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులు ప్రజల నుంచి మొత్తం 232 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. గత వారం వచ్చిన అర్జీల్లో 8 మరోసారి అందాయన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డీసీఓ కృష్ణానాయక్, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, చేనేత జౌళి శాఖ జేడీ పద్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్ ఖాన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

'స్పందన'కు వచ్చిన అర్జీల్లో కొన్ని..

- ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ అనారోగ్యంతో తన భర్త శ్రీరాంనాయక్ మరణించి 13 ఏళ్లు అయిందని, కారుణ్య నియామకం కింద కుటుంబంలో ఇప్పటి వరకూ ఎవరికీ ఉద్యోగం ఇవ్వలేదని పుట్టపర్తి మండలం పెడపల్లి పెద్దతండాకు చెందిన జ్యోతిబాయి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రెండు సార్లు వెరిఫికేషన్ చేశారని, ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని కోరారు.
- వంద శాతం అంధత్వం ఉన్నా కష్టపడి డిగ్రీ పూర్తి చేసిన తనకు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా ల్యాప్‌టాప్ ఇప్పించి ఆదుకోవాలని గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన లలితమ్మ విన్నవించారు. రెండు సంవత్సరాల నుంచి తిరుగుతున్నా మంజూరు కాలేదని వాపోయారు.
- రొద్దం మండలం కోగిర గ్రామ సర్వే నంబర్ 41–6 లో ఉన్న తన 2.19 ఎకరాల భూమిని, కొంత మంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రొద్దం మండలం బీదానిపల్లికి చెందిన అంజినమ్మ ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.
- లేపాక్షి జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం కొంత మంది సంఘాల నాయకులు ప్రిన్సిపాల్‌పై బెదిరింపులకు దిగుతున్నారని సర్పంచ్ ఆదినారాయణ ఆరోపించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు మరింత పెరగాలన్నారు. వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది సమన్వయంతో సేవలందించాలన్నారు. హిందూపురం, కదిరి, ధర్మవరం, మడకశిర ఆస్పత్రుల్లో వంద శాతం ప్రసవాలు జరగాలన్నారు. అగళి, అమడగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకు ఒక్క ప్రసవమూ జరగలేదని, పీహెచ్‌సీ పరిధిలోనే ప్రసవాలు తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. హైరిస్క్ కేసులను మాత్రమే సామాజిక ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయాలన్నారు. గర్భిణీ ఎప్పుడు, ఎక్కడ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారో వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. ఆశ, ఏఎన్‌ఎంల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహనీయుడు సత్యసాయి

- కేరళ ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్
- ప్రశాంతి నిలయంలో అంబరాన్నంటిన తిరు ఓనం సంబరాలు



ప్రసంగిస్తున్న కేరళ ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్



కేరళ బాలవికాస్ చిన్నారుల నృత్యప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యం, ధర్మం, శాంతి, ప్రేమలను బోధిస్తూ ప్రపంచ మానవాళిని సన్మార్గంలో నడిపిన మహనీయుడు సత్యసాయి అని కేరళ ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో ఓనం సంబరాలు రెండో రోజు సోమవారం కూడా అంబరమంటాయి. కేరళ రాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జయకుమార్, కేరళ విద్యుత్ శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా మహాసమాధి చెంత సత్యసాయి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్, డైరెక్టర్ జయకుమార్ మాట్లాడుతూ సత్యసాయి చూపిన మార్గం సదా అనుసరణీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల ఆకలి దప్పులు సత్యసాయి భక్తులు తీరుస్తున్నారన్నారు.అనంతరం బాలవికాస్ కేరళ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంగీత కచేరీతో అలరించారు. సత్యజీత్ సంజూ బృందం భక్తిగీతాలు ఆలపించి భక్తులను మైమరపించింది. కళాకారులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు నూతన వస్త్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యజీత్ సంజూ బృందం

సచివాలయాల్లో 'ఓపెన్' రిజిస్ట్రేషన్లు

అనంతపురం సిటీ: విద్యా సంస్థల్లో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. చదువుకోవాలన్న తపన ఉన్నా.. వివిధ కారణాలతో బడి మానేసిన వారి కోసం ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులు, పరీక్షలు నిర్వహించే వారు. దీన్ని మరింత సరళతరం చేస్తూ ఇక నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు సంబంధించి అందుబాటులో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు తమకు ఉత్తర్వులు అందాయని అనంతపురం డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ సోమవారం తెలిపారు.

అడ్మిషన్ ఎలా పొందాలంటే..

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా అడ్మిషన్ తీసుకోవాల్సి ఉంటుందని డీఎల్‌డీఓ తెలిపారు. దీని కోసం ఓపెన్ స్కూల్ సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎలాంటి అదనపు రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 వరకు గడువు ఉందని తెలిపారు. అదనపు రుసుంతో కలిపి అక్టోబర్ 5 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సచివాలయ భవన సముదాయం

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 41 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 41 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా సడ్లపల్లి



నియామక పత్రం అందుకుంటున్న సడ్లపల్లి వెంకటేష్‌రెడ్డి


హిందూపురం: రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా సడ్లపల్లి వెంకటేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైజాగ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు నియామక పత్రాన్ని రెడ్డి జేఏసీ రాష్ట్ర సలహాదారు, గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి అందజేశారు.

రేపు డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

అనంతపురం టౌన్: డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 30, 31వ తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు డాక్యుమెంట్ రైటర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్సుల పునరుద్ధరణ చేపట్టాలని, ఈ-స్టాంపింగ్ వెండర్లుగా డాక్యుమెంట్ రైటర్లకు ప్రత్యేక లైసెన్సులు జారీ చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు.

జన భాషకు దివిటీ... గిడుగు

- వ్యవహారిక భాషా పితామహుడు జీవీ రామ్మూర్తి
- నేడు కలెక్టరేట్‌లో జయంతి



గిడుగు వెంకట రామ్మూర్తి

పుట్టపర్తి టౌన్: తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు వెంకట రామ్మూర్తి. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని అందాన్నీ, సౌకర్యాన్నీ తెలియజెప్పిన మహనీయుడు.. వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు ఆయన. బహుభాషా శాస్త్రవేత్తగా, చరిత్రకారుడిగా, సంఘసంస్కర్తగా, హేతువాదిగా. శిష్టజన వ్యవహారికభాషను గ్రంథ రచనకు స్వీకరింపజేసేలా చిత్తశుద్ధితో ఆయన చేసిన కృషి వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహారికభాషలో సాగి అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి నేడు ప్రతి ఒక్కరికీ వీలైంది. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

తెలుగుబాషకు ఎనలేని సేవ..

తెలుగు భాష అందమైనదే కానీ ఇప్పటిలా ఒకప్పుడు సరళమైనది కాదు. జన సమూహంలో ఉన్న భాష వేరు.. రాత భాష మరోలా ఉండేది. కానీ సరళమైన పదాలకు పట్టం కట్టి పుస్తకాల్లో చోటు కల్పించిన ఘనత గిడుగు రామ్మూర్తి పంతులుకు దక్కుతుంది. సంక్లిష్ట పదబంధాలను విడగొట్టి, వ్యవహారిక భాషకు పట్టం కట్టి తెలుగు భాషలోని తియ్యదనాన్ని భావితరాలకు రుచి చూపించారు. శ్రీకాకుళం జిల్లా పర్వజాలపేటలో వీర్రాజు, వెంకటమ్మ దంపతులకు 1863, ఆగస్టు 29న జన్మించిన ఆయన... రాష్ట్రంలో వ్యవహారిక భాషోద్యమానికి పితామహుడిగా ఖ్యాతిగాంచారు. 1930 నుంచి 1940 వరకు తెలుగుభాషకు ఆయన ఎనలేని కృషి చేశారు. ఉద్యమానికి వీరేశలింగం పంతులు కూడా ఊతమిచ్చారు. 1913- 20 మధ్యలో వ్యవహారిక భాషోద్యమాన్ని ప్రచారం చేసేందుకు తెలుగు మాస పత్రిక నడిపారు. ఆంధ్ర సాహిత్య పరిషత్ సభలో నాలుగు గంటల పాటు మాట్లాడి గ్రంథాల్లో ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా తీర్మానం చేసేలా ప్రభావితం చేశారు. సాహితీ సమితి, నవ సాహితీ సమితి వంటి సంస్థలు కూడా గిడుగుకు గొడుగుపట్టాయి. తన జీవితం మొత్తం తెలుగుభాషకు ఆయన అంకితం చేశారు.

కలెక్టరేట్‌లో గిడుగు జయంతి

పుట్టపర్తి అర్బన్: తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా టూరిజం శాఖ, విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ అరుణ్‌బాబు నివాళులర్పించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సందర్భం

నేడు తెలుగు భాషా దినోత్సవం



తెలుగుపై మమకారం పెంచుకోవాలి



ఇప్పటి రోజుల్లో విద్యార్థులు చాలా మంది ఆంగ్లభాషలో చదివి తెలుగును మరచి పోతున్నారు. తెలుగు మాట్లాడడమే కాదు తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి. తెలుగుకు సంబంధించిన గత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెలుగు నేర్చుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి.

– హర్షవర్ధన్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు

తల్లిదండ్రులూ శ్రద్ధ చూపాలి



తెలుగు భాష అమ్మలాంటిది. అమ్మ భాష గొప్పతనాన్ని నేటి పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పిల్లలు ఏం చదువుతున్నారు. భాషా పరిజ్ఞానం ఏ మేరకు ఉంది అనే అంశాలను గమనించకుండా పర భాషపై మక్కువ చూపడం సబబు కాదు. ప్రతి ఒక్కరూ మాతృభాషపై మక్కువ కలిగి ఉండాలి.

– డా. అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత, కదిరి

పాముకాటుతో వ్యక్తి మృతి



మృతుడు మల్లన్న

రొళ్ల: మండలంలోని పి.గొల్లహట్టికి చెందిన ఎ.మల్లన్న(45) పాముకాటుతో మృతి చెందాడు. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య కరియమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 18న గొర్రెలను రంగనపల్లి చెరువు వద్దకు మేపునకు తీసుకెళ్లినప్పుడు పాము కాటు వేసింది. అప్పటి నుంచి బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన... పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పేలుడు పదార్థాల వినియోగంపై కేసు నమోదు

చిలమత్తూరు: అడవి పందులను వేటాడేందుకు వినియోగించిన పేలుడు పదార్థం నమలడంతో దేమకేతేపల్లి నివాసి పాడి రైతు నరసింహప్పకు చెందిన ఆవు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... ఆదివారం సాయంత్రం ఎస్సీ కాలనీ సమీపంలో పెద్దప్పయ్యకు చెందిన పొలాల్లో అడవి జంతువులను వేటాడేందుకు పేలుడు పదార్థాలు ఉంచారని, అవి నమిలి ఆవు చనిపోయిందన్నారు. జంతువులపై హింస, పేలుడు పదార్థాలు వాడకం చట్ట విరుద్ధమన్నారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. త్వరలో నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఖాతాదారులకు సత్వర సేవలు

- ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ రాకేష్ కశ్యప్



సరళ రుణ వితరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాకేష్ కశ్యప్

ప్రశాంతి నిలయం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఖాతాదారులకు సత్వర సేవలు అందిస్తున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని ఏపీజీబీ శాఖలో సరళ రుణ వితరణ కేంద్రం -2ను సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సరళ రుణ వితరణ కేంద్రం ద్వారా వివిధ రుణాలను సత్వరమే మంజూరు చేస్తారన్నారు. కార్పొరేట్ బ్యాంక్‌లకు ధీటుగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు అందించడంలో ఏపీజీబీ అన్నింటా ముందంజలో ఉందన్నారు. రైతులకు పంట, యంత్ర కొనుగోలు రుణాలతో పాటు విద్య, ఉపాధికి సంబంధించిన రుణాలను సైతం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఆర్ఎం రవీంద్రారెడ్డి, స్థానిక ఆ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణగౌడ్, సరళ రుణ వితరణ కేంద్రం సీనియర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఇక నువ్వు భిక్షమెత్తుకోవాల్సిందే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



వేదికపై ఎమ్మెల్యేతో పాటు ఆసీనులైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, తదితరులు

- తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- యాడికి మండలంలో ముగిసిన ప్రజాసంక్షేమ పాదయాత్ర

పెద్దపప్పూరు: రాజకీయంగా వెంటిలేటర్‌పై ఉన్న జేసీ ప్రభాకరరెడ్డి భవిష్యత్తులో భిక్షమెత్తుకోవాల్సిందేనని, ఇందుకోసం ఇప్పటి నుంచే పట్టణాభివృద్ధి కోసమంటూ వీధుల్లో అడుక్కోవడం మొదలుపెట్టారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. ఇది ఆయనకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని ఎద్దేవా చేశారు. యాడికి మండలంలో ప్రజాసంక్షేమ పాదయాత్ర సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా యాడికిలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

జేసీపీఆర్‌కు మతి భ్రమించింది

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రి నియోజకవర్గంలో 40 ఏళ్లు రాజకీయ పదవులు అనుభవించిన జేసీ సోదరులు ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. వీరి దౌర్జన్యాలతో విసుగు చెందిన ప్రజలు 2019లో తిరుగులేని సమాధానంతో ఇంటికే పరిమితం చేయడంతో జేసీ ప్రభాకరరెడ్డికి మతిభ్రమించిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకుని, అధికారులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లో ప్రజాసంక్షేమ పాదయాత్ర దిగ్విజయంగా సాగిందన్నారు. దమ్ముంటే జేసీ ప్రభాకరరెడ్డి ఒకరి సాయం లేకుండా కనీసం 3 కిలోమీటర్ల పాదయాత్ర చేయాలని సవాల్ చేశారు.

ఖనిజ సంపదను దోచేశారు

అధికారాన్ని అడ్డుపెట్టుకుని యాడికి మండలం కోనుప్పలపాడు సమీపంలో త్రిశూల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామంటూ 1,250 ఎకరాలు అప్పటి ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకుని ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన నీచమైన చరిత్ర జేసీ సోదరులదని పైలా నరసింహయ్య విమర్శించారు. అప్పట్లో రాజకీయ పలుకుబడితో ఖనిజ సంపదను అడ్డగోలుగా దోచుకున్నారని గుర్తు చేశారు.

- నాలుగు దశాబ్దాల పాటు తాడిపత్రి నియోజకవర్గానికి పట్టిన శని 2019లో ఓటర్ల దెబ్బకు విరగడైందని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు.
- కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను దరిచేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కొనియాడారు.
- తెలంగాణలోని గద్వాల్‌లో జేసీ సోదరుల అరాచకాలు తట్టుకోలేక అక్కడి వారు తరిమేయడంతో తాడిపత్రి ప్రాంతానికి వలస వచ్చారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గుర్తు చేశారు. ప్రస్తుతం జేసీ ప్రభాకరరెడ్డి దెబ్బకు తట్టుకోలేక అన్న జేసీ దివాకర్ రెడ్డి ఇల్లు విడిచి దూరంగా నివాసముంటున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపును అడ్డుకోవడం ఎవరి తరం కాదన్నారు.

కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరా, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్, ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, యాడికి సర్పంచ్ అనురాధ, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకులు బాల రమేష్‌బాబు, బోగతి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి మెరిట్ జాబితా విడుదల

అనంతపురం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌ల్యాగ్ పోస్టుల భర్తీకి వెలువడిన నోటిఫికేషన్‌ను అనుసరించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు కలెక్టర్ గౌతమి ప్రకటించారు. ఇందుకు సంబంధించి వివరాలను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను కలెక్టర్ కార్యాలయంలోనూ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కార్యాలయంలోనూ అందుబాటులో ఉంచామన్నారు. అదే విధంగా జిల్లా వెబ్‌సైట్ http://ananthapuramu.ap. gov.in లోనూ ఉంచామని తెలిపారు. అభ్యర్థులు జాబితాను పరిశీలించుకుని ఏవైనా ఆక్షేపణలు ఉంటే రాతపూర్వకంగా ఆధారాలతో సమర్పించాలని సూచించారు.

కార్పొరేట్ ఆహార మాయలో ఆధునిక సమాజం

- డాక్టర్ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలి

రాప్తాడురూరల్: కార్పొరేట్ ఆహార మాయలో ఆధునిక సమాజం కూరుకుపోయిందని కృషిరత్న పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల బోటనీ విభాగం, పర్యావరణ క్లబ్ సంయుక్తంగా సోమవారం 'సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రోజూ మనం తీసుకునే ఆహారంలో అనేక రకాల విషపూరిత పదార్థాలు ఉంటున్నాయన్నారు. వీర్య కణాల వృద్ధి లేక సంతోనోత్పత్తి బాగా తగ్గుతుందన్నారు. వరి, గోధుమ, చక్కెర వంటి వాటిని వదిలేస్తే ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. వీటి స్థానంలో సంప్రదాయ తృణధాన్యాలను తీసుకోవాలన్నారు. పుట్టబోయే పిల్లల్లో అనేక రకాల సమస్యలు రావడానికి కారణం మనం తీసుకునే ఆహారమేనన్నారు. ఆడపిల్లల్లో జరుగుతున్న అనేక మార్పులు, గైనకాలజీ సమస్యలకు కారణం ఈ రోజు తీసుకుంటున్న పాలేనన్నారు. పాలు తీసుకోవడం ఆర్నెల్లు ఆపేస్తే గైనకాలజీ సమస్యలు ఏవీ ఉండవన్నారు. నేటి ప్రపంచం విజ్ఞానం పేరుతో మానవజాతి నిత్యం తీసుకునే ప్రతి దానిని వ్యాపారం చేస్తోందన్నారు. విజ్ఞానం సరియైన దారిలో వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీ ప్రకటనలు, కార్పొరేట్ మాయాజాలానికి మోసపోవద్దని కోరారు. కేవలం మన సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో ఆహార అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత పెరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఖాదరవలీని సన్మానించారు. కార్యక్రమంలో పర్యావరణ క్లబ్ కన్వీనర్ డాక్టర్ బి. మనోహర్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఈ. శ్రీదేవి, సభ్యులు డాక్టర్ రఘురాములు, వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌలాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఖాదర్‌వలీ సదస్సులు

అనంతపురం అగ్రికల్చర్: సిరిధాన్యాలు, పర్యావరణ పరిరక్షణ, మధుమేహర హిత జీవనం తదితర అంశాలపై మంగళవారం సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్రాంత ప్రొఫెసర్ గంగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు రెడ్స్ ఆధ్వర్యంలో రూరల్ మండలం కురుగుంటలోని మహిళా రైతుల సామూహిక వ్యవసాయ క్షేత్రంలో సదస్సు ఉంటుంది. ప్రఖ్యాత శాస్త్రవేత్త, కృషిరత్న డాక్టర్ ఖాదర్‌వలీ ముఖ్య అతిథిగా హాజరై సిరిధాన్యాల ఆవశ్యకతను వివరించనున్నారు. కలెక్టర్ ఎం .గౌతమి, డీఐజీ అమ్మిరెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరు కానున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ కళాశాల డ్రామా హాలులో పర్యావరణ పరిరక్షణపై సదస్సు ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు స్థానిక ద్వారాకా విల్లాస్‌లోఉన్న క్లబ్ హౌస్‌లో జరిగే సదస్సులో ఖాదర్‌వలి పాల్గొంటారు.

సెల్ టవర్ ఎక్కిన ఆర్‌ఎంపీ

- ఏడాది క్రితం సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.15లక్షలు మోసపోయిన వెంకటేష్
- ఫిర్యాదు చేసినా పోలీసులు న్యాయం చేయలేదంటూ ఆవేదన



సెల్ టవర్ ఎక్కుతున్న ఆర్‌ఎంపీ వెంకటేష్

పుట్లూరు: సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.15లక్షలు మోసపోయిన ఓ ఆర్‌ఎంపీ.. తనకు పోలీసులు న్యాయం చేయలేదంటూ సోమవారం సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. వివరాలు.. పుట్లూరు మండలం ఎ.కొండాపురంలో ఆర్‌ఎంపీగా జీవనం సాగిస్తున్న వెంకటేష్‌కు సెల్‌ఫోన్‌కు గత ఏడాది లక్కీ డ్రాలో కారు గెలుచుకున్నట్లు సంక్షిప్త సమాచారం అందింది. దీనిని చూసిన ఆయన అందులో పేర్కొన్న నంబర్‌ను సంప్రదించారు. అనంతరం పలు దఫాలుగా రూ.15 లక్షలను అవతలి వ్యక్తి ఖాతాకు మళ్లించారు. అయినా కారు అందకపోవడంతో అనుమానం వచ్చి నిలదీస్తే అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాప్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన వెంకటేష్.. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెలలు గడుస్తున్నా ఈ కేసులో పురోగతి లేకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం ఉదయం సెల్ టవర్ ఎక్కి తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పుట్లూరు ఎస్ఐ దిలీప్‌కుమార్ అక్కడకు చేరుకుని వెంకటేష్‌కు నచ్చజెప్పి కిందకు దిగేలా చేశారు. సైబర్ నేరంపై కేసు నమోదైందని, బ్యాంకు ఖాతాలో ఫ్రీజ్ చేయించిన రూ.2లక్షలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని భరోసానిచ్చారు.